క్లుప్తంగా

ఘనంగా కౌండిన్య మహర్షి జయంతి



కౌండిన్య మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్: కౌండిన్య మహర్షి జయంతిని శనివారం పానగల్ గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం పానగల్ కమిటీ నాయకులు జెర్రిపోతుల యాదయ్య గౌడ్, గుండగోని సత్తయ్యగౌడ్, డైరెక్టర్ కొప్పు ప్రవీణ్‌గౌడ్, సత్తయ్యగౌడ్, గుండగోని వెంకటయ్యగౌడ్, గుండగోని శ్రీను, కొప్పు సైదులుగౌడ్, రావుల నాగరాజుగౌడ్, రవిగౌడ్, చనగోని యాదగిరిగౌడ్, మురళిగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు చిక్కుల మదనయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్ప రెడ్డి, విజయకుమార్, లింగారెడ్డి, సత్యనారయణ, సునిత ఉన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత



ప్రొజెక్టర్‌ను అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

చండూరు : మండలం పరిధిలోని బంగారిగడ్డ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ రూ.20 వేల విలువ గల ప్రొజెక్టర్‌ను శనివారం ఆ ఫౌండేషన్ సభ్యుడు నరేందర్‌రెడ్డి , మండల విద్యాధికారి సుధాకర్ రెడ్డి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భిక్షం తదితరులు ఉన్నారు.

పేదరికాన్ని రూపు మాపేది చదువే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య

నకిరేకల్ : పేదరికాన్ని రూపు మాపేది చదువేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, హరిత, ఐక్యూసీ కోఆర్డినేటర్ శ్రీనివాసాచారి, అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి, శంకర్, ఉపేందర్, సతీష్, సయ్యద్, వెంకన్న పాల్గొన్నారు.

గౌడ సంఘం జిల్లా కార్యదర్శిగా యాదగిరి

శాలిగౌరారం: కౌండిన్య గౌడ సంఘం జిల్లా కార్యదర్శిగా మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన ఈదులకంటి యాదయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎల్‌ఎస్ఎస్ ప్రసాద్ శనివారం నియామక పత్రాన్ని యాదగిరికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు బీసు మల్లేష్, పబ్బు లింగయ్య, గంగాపురం భాస్కర్, పల్లె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

రామగిరి(నల్లగొండ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో 3వ రోజు శనివారం పాఠశాల విద్యార్థులకు వాతావరణ కాలుష్యంలో ప్లాస్టిక్ వస్తువుల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని, గెలుపొందిన విద్యార్థులకు 20 తేదీన బహుమతులు అందజేస్తామని సిబ్బంది తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రాజేశ్, కట్టా నాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు. శనివారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో విద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా కృషిచేయాలని కోరారు. అనేక మంది నిరుపేదలు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారన్నారు. దీంతో ఆ పేద కుటుంబాల ఆదాయంలో దాదాపు 80శాతం విద్యకే ఖర్చుచేయాల్సి వస్తుందన్నారు. వారి అందరికీ నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం నుంచి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో పాఠశాలల పునః నిర్మాణం చేపడుతామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ భిక్షపతి, నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యా అధికారులు, కాంప్లెక్స్ హెచ్.ఎంలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతులు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం మునుగోడుకు వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రాలు అందించారు. అందులో ప్రధానంగా మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామ పశువైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలని కోరారు. అదే విధంగా కొతులారం గ్రామంలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో టీపీసీసీ నాయకుడు వట్టికొటి శేఖర్, మందలు బీరప్ప, చెర్కు జనార్దన్, దండు లింగస్వామి, అంజయ్య, కూతాటి భిక్షయ్య, వల్లూరి యాదయ్య పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక



మెండే ప్రణబ్



జైపాల్‌రెడ్డి

చిట్యాల: వరుసగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ యువకుడు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన సుర్కంటి మోహన్‌రెడ్డి, దేవేంద్రమ్మల రెండో కుమారుడు జైపాల్‌రెడ్డి ఎంటెక్ పూర్తి చేశాడు. 2020లో జైల్ వార్డెన్ నోటిఫికేషన్ రావటంతో రాసి ఉద్యోగాన్ని సాధించాడు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం చర్లపల్లి జైల్‌లో జైల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2022లో పోలీస్ సివిల్ కానిస్టేబుల్ పరీక్షకు హాజరై ఉద్యోగాన్ని సాధించాడు. కాని ఆ ఉద్యోగంలో చేరలేదు. 2023లో గ్రూపు-4 పోటీ పరీక్షలను రాయగా గురువారం విడుదలైన ఫలితాల్లో రెవెన్యూ విభాగంలో సీసీఎల్‌ఏలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా గ్రూపు-1లో మెయిన్స్ పరీక్షను ఇటీవల రాసినట్లు ఆయన తెలిపారు.

ప్రణబ్‌కు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కేశరాజుపల్లి గ్రామానికి చెందిన మెండే లచ్చయ్య, సునీత దంపతుల కుమారుడు ప్రణబ్ 2019లో మొదటి సారి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాధించాడు. అదే విధంగా 2020లో అగ్నిమాపక శాఖ లో ఫైర్‌మెన్ ఉద్యోగం, 2024లో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉగ్యోగాలు రాగా, తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం సాధించి అందరి మన్ననలు పొందాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్ ఆండాలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు కలరు. గతంలో సివిల్ కానిస్టేబుల్ ఫలితాల్లో రెండవ కుమార్తె నక్క స్వాతి, మూడవ కుమార్తె నక్క ప్రియాంకలు కానిస్టేబుళ్లుగా సెలక్ట్ అయ్యారు. ప్రస్తుతం ప్రియాంక కానిస్టేబుల్ ట్రైనింగ్ పూర్తి చేయగా స్వాతి గురువారం వెలువడిన గ్రూప్-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులతోపాటు తమ గురువుల ప్రోత్సాహంతోనే ఉద్యోగాలు సాధిస్తున్నట్లు పేర్కొంది.

గ్రూప్ 4 ఉగ్యోగాలకు ఎంపిక

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్ర గ్రంథాలయ పాఠకులు గ్రూప్ 4 ఉద్యోగాలు సాధించినట్లు సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ పాఠకులు ఎస్. ఆనంద్ జూనియర్ అసిస్టెంట్, ఎస్.రాజిరెడ్డి వార్డు ఆఫీసర్, శంకర్, మహేష్, వంశీ వార్డు ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఆదర్శ రైతుల నూతన కమిటీ ఎన్నిక

చండూరు : ఆదర్శ రైతుల మండల నూతన కమిటీని శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పంకర్ల అయిలయ్య, గౌరవ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా దోటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బుర్కల వెంకన్న, కార్యదర్శి మలిగె లింగస్వామి, కోశాధికారి నల్ల వెల్లి మల్లేశం, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

తిప్పర్తి : కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సూపర్‌వైజర్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీసీఏలో కొనసాగించాలని వినతి

నల్లగొండ టూటౌన్ : అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులాన్ని బీసీఏలో కొనసాగించాలని కోరుతూ ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయిన రమణ ముదిరాజ్ శనివారం జిల్లాకు వచ్చిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి వైస్. రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ డి నుంచి నుంచి బీసీఏ లోకి మార్చారని తెలిపారు. కానీ కొందరు కోర్టును ఆశ్రయించడంతో అది నిలిచిపోయిందని ఆఆయన వివరించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

నల్లగొండ టౌన్: అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18న కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19,20 తేదీల్లో జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు అందజేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్స్ శంకర్, గిరి, మహేశ్వరచారి, వినోద్, సైదులు పాల్గొన్నారు.

గుండ్రాంపల్లి విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం మసరం శ్రీనివాస్, తెలుగు భాషోపాధ్యాయురాలు డాక్టర్ ఉప్పల పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మూడు వందల మంది విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గుండ్రాంపల్లి విద్యార్థినులు ప్రతిభ చాటారు. పుస్తక సమీక్షలో పదవ తరగతి చదువుతున్న కంకాల శిరీష ప్రథమ బహుమతిని గెలుచుకోగా, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో బందారపు అక్షిత ప్రథమ బహుమతి సాధించింది. వీరికి నగదు బహుమతితో పాటుగా సర్టిఫికెట్‌ను, కథల సంచులను శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకులు పద్మభూషన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు కె.వి.రమణాచారి, ం ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జుర్రు చెన్నయ్య, మత్రి రామారావు, బాలసాహితివేత్త గరిపల్లి అశోక్ అందజేశారు. పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం మసరం శ్రీనువాస్, ఉపాధ్యాయుల అభినందించారు.

'చలో హైదరాబాద్' ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెరిక శ్రీనివాసులు

మర్రిగూడ: ఆసరా పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న చేపట్టే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు రూ.4వేలను పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరించారని అన్నారు. వెంటనే ఆసరా పింఛన్లను పెంచి పేదలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ కొమ్ము హరికుమార్, ఎం.నరసిహా, బొంత దశరథ, మునగపాటి పరమేశ్వరి, ఆంబోతు శ్రీలత, జంగయ్య, అజిత్, రమేష్, లక్ష్మయ్య, ముత్తయ్య, చంద్రయ్య, మారయ్య, భారతమ్మ పాల్గొన్నారు.

సాందీప్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నల్లగొండ టూటౌన్ : ప్రతిష్టాత్మకమైన శ్రీనివాస రామానుజన్ లెవల్ వన్ పరీక్ష ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని సాందీప్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు లెవల్ -2కు ఎంపికయ్యారు. శనివారం లెవల్ -2కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గానూతుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, ప్రణాళికా బద్ధమైన ఐఐటీ ఫౌండేషన్ తరగతుల నిర్వహణతోనే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని తెలిపారు.

కిషోర్‌కుమార్‌కు అవార్డు

నల్లగొండటౌన్: పట్టణానికి చెందిన ఆర్మ్‌డు రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పల్లెకిషోర్‌కుమార్ పాన్ ఇండియన్ అవార్డు దక్కింది. ఇండో కెనడా యూత్ కౌన్సిల్ వారిచే శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును ఎమ్మెల్సీ కోదండరామ్, డాక్టర్ గజల్‌శ్రీనివాస్ అందజేశారు. సామాజిక సేవలకు గుర్తింపుగా అవార్డును ఇండో కెనడా యూత్ కౌన్సిల్ ప్రదానం చేసింది.



అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్

బోరుమోటారు మంజూరు



డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

శాలిగౌరారం: మండలకేంద్ర ప్రజలకు ఇక తాగునీటి సమస్య తీరనుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీల్యాడ్స్ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేశారు. అందులో భాగంగానే శనివారం నూతనంగా బోరు వేశారు. బోరు డ్రిల్లింగ్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు చామల జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుసుకుందాం

ఒంటి స్తంభం.. విశిష్ట కళా రూపం

నీలగిరి పట్టణంలోని మాల్ బౌలీలో 13వ శతాబ్దంలో నిర్మించిన 41 అడుగుల ఎత్తు కలిగిన ఏకశిలా స్తంభం నేటికీ చెక్కుచెదరకుండా చరిత్ర ఆనవాళ్లకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. కల్యాణి చాళుక్య రాజుల కాలంలో విజయానికి గుర్తుగా నిర్మించిన ఈ స్తంభాన్ని 1960లో అప్పటి ఏపీ ప్రభుత్వ పురావస్తు శాఖ ప్రాచీన స్మారక చిహ్నంగా గుర్తించింది. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చి స్తంభం విశిష్టతను ప్రపంచానికి తెలిసేలా చేయాలని చరిత్రకారులు కోరుతున్నారు.



నల్లగొండ మాల్‌బౌలీలో 41 అడుగుల అష్టభుజి ఏకశిలా రూపం

13వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యుల విజయానికి గుర్తుగా నిర్మాణం

1960లో ప్రాచీన స్మారక చిహ్నంగా గుర్తింపు

నేటికీ చెక్కుచెదరని రాతిస్తంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాల్‌బౌలీలో ఇళ్లమధ్య 41అడుగుల ఎత్తున్న ఒంటి స్తంభం ప్రాచీన కళారూపానికి నిదర్శనంగా కనిపిస్తోంది. అష్టభుజాలు కలిగిన ఈ స్తంభం కాపురాలగుట్టకు ఉత్తరం దిక్కున ఉంది. ఈ స్తంభాన్ని 13వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యులు నిర్మించినట్టు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఏకశిలారూపంలో అంతెత్తు స్తంభాన్ని చెక్కి నిలుపడం నాటి శిల్పుల శిల్పకళా కౌశల్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ స్తంభానికి సంబంధించిన శాసనపరమైన ఆధారాలు నేటికీ లభించలేదు. నేటికీ చెక్కుచెదరని ఈ రాతిస్తంభం పక్కనే చాలా నివాసగృహాలు వెలిశాయి.

విజయానికి చిహ్నంగా..

నల్లగొండ పాతబస్తీలో ఉన్న ఒంటి స్తంభం కళ్యాణి చాళుక్యుల వంశవైభవాన్ని గుర్తు చేస్తుంది. పట్టణం నడిబొడ్డున గల ఏకశిలా రాతి స్తంభం చరిత్రకు సాక్ష్యంగా రిత్రాత్మకమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1960లో పురావస్తు శాఖ వారు ప్రాచీన స్మారక చిహ్నంగా గుర్తించారు. అందరికి తెలియజేసేలా ఈ స్తంభం ఆవరణలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన బోర్డు ఇప్పటికీ ఉంది.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

41 అడుగుల ఎత్తున్న ఈ ఏకశిలా స్తంభం ప్రారంభంలో రెండున్నర ఫీట్ల వెడల్పుతో నాలుగు భుజాలు కలిగి ఉంది. ఆ తర్వాత పైభాగం అష్టభుజాలు కలిగి ఉంది. స్తంభం చుట్టూ 5 అడుగుల ఎత్తు వేదిక నిర్మించారు. ప్రాచీన చారిత్రక సంపద అయిన ఈ స్తంభం విశిష్టతను ప్రజలకు తెలిసేలా ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చరిత్రాకారులు కోరుతున్నారు.

పాతబస్తీలోగల మాల్‌బౌలీలో ఉన్న ఒంటి స్తంభం

ప్రారంభమైన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో వైశ్యాభవనం వెనుక సూమారు రూ. కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ, దేవాతా విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజు ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి ప్రార్థన మంగళవాయిద్యాలతో యాగశాల ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం హోమం, ధాన్య దివాసాపూజ,18 జలాదిసాపూజలు, 19న శాంతి కల్యాణం హోమం, 20న అమ్మవారి విగ్రహ, ధ్వజ స్థంభం ప్రతిష్ట అన్న ప్రసాద కార్యక్రమాలు జరగనున్నాయి నిర్వహకులు తెలిపారు.ఈ వేడుకల్లో ఆలయ కమిటీ నిర్వహకులు గర్రె రాంమూర్తి, బ్రహ్మదేవర విశ్వనాథం, బ్రహ్మదేవర లక్ష్మయ్య, బ్రహ్మదేవర పద్మాక్రిష్ణ మూర్తి, గర్రె వెంకన్న, గర్రె శ్రీనివాస్,వీర్లపాటి రాంబాబు,వీర్లపాటి లక్ష్మీరాబాబు, బ్రహ్మదేవర నర్సింహారావు, శ్రీనివాస్, వీర్లపాటి కృష్ణ, కూరెళ్ల శ్రీనివాస్,ఆర్యవైశ సంఘం ప్రతినిధులు బ్రహ్మదేవర రాంమోహన్‌రావు, గర్రె మురళి మోహన్,బ్రహ్మదేవర రమేష్,రామకృష్ణ,.పోతుగంటి రాంమూర్తి,సోమ అశోక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిట్యాల: పట్టణంలోని ఆదివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3:30 వరకు చిట్యాలలోని ఆటోనగర్‌తో పాటు నేరడ వ్యవసాయ మీటర్‌లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ లైన్‌మన్ ఈశ్వర్ శనివారం తెలిపారు. చిట్యాల పట్టణంలోని రైల్వే గేటు నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 33 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ నల్లగొండ కార్యవర్గం

నల్లగొండ టూటౌన్ : అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్ నల్లగొండ కార్యవర్గం ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రానికి వచ్చినప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఝిరెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, ఇతర బాధ్యులు అశోక్‌రెడ్డి, ఉపేందర్, సాధిక్ అలీ, పుప్పాల మట్టయ్య, కట్ట సుధాకర్, సయ్యద్, ఉయ్యాల లింగయ్య, సోమ చంద్రశేఖర్, సత్యం, అంజయ్య, కంది భజరంగ్ ప్రసాద్, భాస్కర్, కంది శ్రీనివాస్, కనకయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల పరిశీలన



నార్త్ సైడ్ సర్వీస్ రోడ్డు గుండా వెళ్తున్న వాహనాలు

చిట్యాల: పట్టణంలో జాతీయ రహదారిపై త్వరలో నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో ట్రాఫిక్ మళ్లింపుతో ఏర్పడనున్న ఇబ్బందులను ముందస్తుగానే తెలుసుకునేందుకు శనివారం కాంట్రాక్టర్ పరిశీలన చేశారు. పట్టణంలో సుమారుగా నలభై కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు గత మార్చి నెలలో శంకుస్థాపన చేశారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జాతీయ రహదారిపై క్రాసింగ్‌ను భారీ గేట్లతో మూసి వేయటంతో పాటుగా ప్రయోగాత్మకంగా పట్టణంలోని నార్త్ సైడ్ సర్వీస్ రోడ్డు గుండా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేశారు. సుమారుగా ఐదు గంటల పాటు వాహనాల మళ్లింపుతో ఏర్పడనున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ట్రాఫిక్‌ను యాథావిధిగా మళ్లించారు.

అల్పాహారం అందించడం అభినందనీయం



అల్పాహారం అందజేస్తున్న డానియల్

నల్లగొండ టౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం రోగుల కుటుంబ సభ్యులకు అల్పాహారం అందించడం అభినందనీయమని నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ అన్నారు. శనివారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అల్పాహారం అందజేసిన సందర్భంగా మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ శక్తి న్యూ వాయిసెస్ ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ ఝాన్సిరాణి పసలపూడి ప్రోత్సాహంతో డొమినిక్ చౌదరి వర్ధంతి సందర్భంగా ఎలిజిబెత్ చౌదరి 450 మందికి అల్పాహారం అందజేయడాన్ని సీఐ కొనియాడారు. కార్యక్రమంలో మాధవి, తబిత, జ్యోతిరెడ్డి, మదన్‌మోహన్, పాల్గొన్నారు.

డిసెంబర్ 30న సీపీఐ శతవార్షికోత్సవాలు

నల్లగొండ టౌన్: సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో పార్టీ శతవార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో రోడ్ల మరమ్మతు చేయాలని, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సమావేశంలో ముండ్లా ముత్యాలు, సైదిరెడ్డి, ఎస్.కె. మదార్, విశ్వనాథుల లెనిన్‌బాబు, ఎస్. వీరయ్య, మేరెడ్డి విజయ్, పుట్టంల సుజాత, జొర్రిగల విజయ, ఎం. కౌసల్యానాయక్, గాదెపాక రమేష్ పాల్గొన్నారు.

బెడ్‌షీట్లు అందజేత

మర్రిగూడ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో గల 50 మంది పేద విద్యార్థులకు బేతల్ గాస్పల్ సంస్థ నిర్వాహకులు బెడ్‌షీట్లు అందజేశారు. కార్యక్రమంలో బూడిద సురేష్, బూడిద కృష్ణయ్య, ఇస్కిళ్ల మహేందర్, జాన్సన్, జ్యోతి, సంస్థ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి

మునుగోడు: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి అన్నారు. శనివారం మునుగోడు మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతు పొందేలా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం. నరేందర్, ఆర్.ఐ రామచంద్రయ్య, కోనుగోళ్ల కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ